RNI NO APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక The Voice of Telangana
శనివారం , 11 - 4 -2026

# గిరిజన ఆదివాసీ గర్భిణుల దుర్భర జీవితం మారేదెన్నడు?

**గాలిలో దీపంలా నిండు గర్భిణీల ప్రాణాలు**

**చింతకుంట ఆదివాసీ గిరిజనుల కష్టాలు తీరేదెన్నడు**

**అంబులెన్స్ చేరే రోడ్డు సదుపాయం లేక..**

**మంచాన్ని డోలిగా మార్చి గర్భిణిని హాస్పిటల్ కు తరలించాల్సిన పరిస్థితి**

**అధికారుల నిర్లక్ష్యం నిండు గర్భిణుల పాలిట శాపంగా మారిందా....?**

**కేవలం ఓట్ల సమయంలోనే గిరిజన గ్రామాలు గుర్తుకొస్తాయా.**

**అభివృద్ధికి ఆమడ దూరంలో భద్రాచలం ఐటిడిఏ కార్యాలయానికి కూతవేటు దూరంలోని గిరిజన గ్రామాలు**

బూర్గంపాడు ఏప్రిల్ 10 (తెలంగాణ వాణి ప్రతినిధి)

గిరిజన గ్రామాల్లో మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సరైన రహదారి సౌకర్యం లేక ఆసుపత్రికి వెళ్లాలంటే నరకయాతన అనుభవిస్తున్నారు. గర్భిణీ స్త్రీలు ఆసుపత్రికి వెళ్లాలంటే డోలీలే దిక్కవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం గిరిజనల అభివృద్ధి కోసం అనుక సంక్షేమ పథకాలు పెట్టినప్పటికీ ఎక్కడా అవి ఆచరణకు నోచుకోలేదు. పాలకులు గిరిజనలపై మాటలతో ప్రేమ చూపిస్తున్నారు తప్ప వారి బ్రతుకులు మార్చే విధంగా మాత్రం ఆలోచన చేయడం లేదు. క్షేత్ర స్థాయిలో గిరిజనుల గోడు వినే నాధుడే కరువైయ్యాడు.





గిరిజనులను కేవలం ఓటు బ్యాంక్ గా మాత్రమే నాయకులు చూస్తున్నారు. ఎన్నికల సమయంలో ఎప్పుడూ రాని నాయకులు తమ ప్రాంతాలకు వచ్చి కళ్లబొల్లి మాటలు చెప్పి వెళ్తున్నారు. అదే సమయంలో వారి కష్టాలను నాయకులకు చెప్పుకుంటూ గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తూనే ఉన్నారు. ఏజెన్సీలో అడుగడుగున అసౌకర్యాలతో, ఇబ్బందులతో పడరాని పాట్లు పడుతున్న గిరిజనులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. భద్రాద్రి జిల్లా బూర్గంపాడు మండలం మోతెపట్టి నగర్ గ్రామపంచాయతీ పరిధిలోని గిరిజన ఆదివాసీ గ్రామమైన చింతకుంట గ్రామానికి సరైన రోడ్డు సదుపాయం లేక నిండు గర్భిణీ అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. చింతకుంట గ్రామానికి చెందిన మడవి నాగేష్ భార్య మడవి సావిత్రి ఏడు నెలల గర్భిణిగా ఉండి ఆమె ఆరోగ్యం ఆందోళనకరంగా మారడంతో అంబులెన్స్ కు కాల్ చేసి హాస్పటల్ కి తీసుకు వెళదామని ప్రయత్నం చేస్తే అంబులెన్స్ రావటానికి దారి లేక మంచాన్ని డోలీగా కట్టి అర్ధరాత్రి సమయంలో సుమారు రెండు కిలోమీటర్లు ఆ డోలిని మోసుకొని వచ్చి గర్భిణి ని అంబులెన్స్ లో ఎక్కించాల్సిన పరిస్థితి. అదే గ్రామంలో నిండు గర్భిణీలు సమయానికి వైద్య సదుపాయం అందక ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు కూడా ఉన్నాయి. కనీసం గ్రావెల్ రోడ్డు సదుపాయం ఉండి ఉంటే అంబులెన్స్ చేరుకొని ఎంతో మంది గర్భిణులకు ప్రాణాపాయం తప్పేది. గిరిజన గ్రామాలు ఓట్ల సమయంలోనే గుర్తుకు వస్తాయా ఓట్ల సమయంలో హడావుడి చేసి మీ గ్రామాలకు అన్నీ మౌలిక వసతులు కల్పిస్తామని హామీలు ఇచ్చే నాయకులు ఓట్లు అయిపోయిన తర్వాత మళ్లీ కన్నెత్తి ఆ గిరిజన గ్రామాల వైపు నాయకులు చూడరని గిరిజన గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గిరిజనుల గ్రామాల అభివృద్ధికై ఉద్యోగాలు చేస్తున్న అధికారులు ఒక్కసారి క్షేత్ర స్థాయిలో చూస్తే ఆ గ్రామాల పరిస్థితి అర్ధం అవుతుంది. భద్రాచలం ఐటీడీఏ కార్యాలయానికి సుమారు ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న గిరిజన గ్రామాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండటం ఆలోచించాల్సిన విషయం... చింతకుంట గ్రామానికి శ్రీరాంపురం పాయం ఎస్టి కాలనీకి అనుసంధానంగా ఉండే సుమారు 650 మీటర్ల గ్రావెల్ రోడ్డు విషయాన్ని స్థానిక సర్పంచ్ కిషోర్ శివరాం నాయక్ ఇప్పటికే ఐటిడిఎ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వినతి పత్రం కూడా అందజేశారు. కానీ అధికారులలో చలనం లేక రోడ్డు పని నిలిచిపోయింది. ఈ రెండు ఆదివాసి గిరిజన గ్రామాలలోని గర్భిణులు, చిన్న పిల్లలు అత్యవసర వైద్య సదుపాయం అవసరమైనప్పుడు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని అటవీ మార్గంలో ఇలాంటి డోలీలను మోసుకుంటూ హాస్పిటల్ కి పరుగులు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. సమయానికి ఏడు నెలల గర్భిణి మడివి సావిత్రి కి వైద్యం అందకపోతే ఆమె పరిస్థితి ఏంటని గిరిజన గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత అధికారులు సత్వరమే స్పందించి కనీస మౌలిక వసతులలో భాగమైన గ్రావెల్ రోడ్డును ఈ చింతకుంట గ్రామానికి వేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆ గ్రామ ఆదివాసి గిరిజనులు వేడుకుంటున్నారు...

## బుచ్చిబాబు జీవితం-సాహిత్యం పుస్తకావిష్కరణ



హైదరాబాద్:ఏప్రిల్ 10 (తెలంగాణ వాణి)

బుచ్చి బాబు రాసిన కథలు,నవల లో ప్రకృతి వర్ణనలు ఎక్కువ గా,కవిత్వంలాగా ఉంటాయని పూర్వ తెలుగు అకాడమీ డైరెక్టర్ వెలిచాల కొండలరావు అన్నారు.శుక్రవారం రవీంద్ర భారతిలో జరిగిన అంపశయ్య నవీన్ రచించిన 'బుచ్చిబాబు జీవితం-సాహిత్యం'పుస్తకావిష్కరణ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ బుచ్చిబాబుకి ఆధునిక తెలుగు సాహిత్యం లో ఒక విశిష్టమైన స్థానాన్ని సంపాదించుకున్నారని అన్నారు.విశిష్ట అతిథి ఏనుగు నరసింహారెడ్డి మాట్లాడుతూ బుచ్చిబాబు కథల్లో గొప్ప కవితావేశం,కళాపటిమ, సౌందర్యదృష్టి,మనోవిశ్లేషణ గోచరిస్తాయని అన్నారు. గౌరవ అతిథులు దర్భశ యనం శ్రీనివాసాచార్య, కె.పి.అశోక్ కుమార్ మాట్లాడుతూ నవీన్ బుచ్చిబాబు జీవితం, సాహిత్య అంశాలను విశ్లేషిస్తూ పుస్తకాన్ని రాయడం అభినందనీయ మని అన్నారు.ఈ కార్యక్ర మంలో బుచ్చిబాబు కుమారు డు శివరాజు సుబ్బారావు, ప్రముఖ రచయిత్రి నెల్లుట్ల రమాదేవి తదితరులు పాల్గొన్న ఈ సమావేశానికి తెలుగు సాహితీ వనం అధ్యక్షురాలు శ్రీమతి శాంతి కృష్ణ సభకు అధ్యక్షత వహించగా డి.శశికిరణ్ వందన సమర్పణ చేశారు. కాగా ఈ కార్యక్రమంలో ప్రముఖ కవులు,రచయితలు అంపశయ్య నవీన్ కుటుంబ సభ్యులతోపాటు మంగారి రాజేందర్,నవీన్ హోత,డి సతీష్,ప్రొ.వడ్డాణం శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్ట్ డా.పొన్నం రవిచంద్ర,డి.స్వప్న తదితరు లు పాల్గొన్నారు.

## లేఅవుట్ల అనుమతికి నిబంధనలు పాటించాల్సిందే : కలెక్టర్ చిత్రా మిశ్రా




కరీంనగర్ ఏప్రిల్ 10 (తెలంగాణవాణి ప్రతినిది)

ప్రభుత్వం నిబంధనల ప్రకారం క్షేత్రస్థాయిలో పరిశీలించి లే అవుట్లకు అనుమతి ఇవ్వాలని కలెక్టర్ చిత్రా మిశ్రా సంబం ధిత శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో పంచాయతీరాజ్, విద్యుత్ శాఖ, టౌన్ ప్లానింగ్, ల్యాండ్స్ అండ్ సర్వే,నీటిపారుదల శాఖ తదితర శాఖల అధికా రులతో లేఅవుట్ కమిటీ సమావేశం నిర్వహించారు. దీనికి కలెక్టర్ లేఅవుట్ కమిటీ చైర్ పర్సన్ గా హాజరై మాట్లాడారు. జిల్లాలో లే అవుట్ అనుమతి కోసం వచ్చిన దరఖాస్తులను 21 రోజుల్లోగా పరిష్కరించాల న్నారు. సైట్ వైస్ విజిట్ చేస్తూ లేఅవుట్ స్థలంలో కనీస సౌకర్యాలు కల్పిస్తున్నారా..?. లైటింగ్, అప్రోచ్ రోడ్డు, వాటర్ సప్లై తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని లేఅవుట్ కమిటీ సభ్యులకు సూచించారు. జీవో నెంబర్ 105 పై దరఖాస్తుదారులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.దరఖాస్తుదా రుల వివరాలను క్షేత్రస్థాయి లో కచ్చితంగా పరిశీలించాల న్నారు.అవసరమైతే సంయు క్త సర్వే చేయాలని అధికారు లను ఆదేశించారు. ఈ సందర్భంగా పలు లే అవుట్ల గురించి చర్చించారు. రెండు రకాల లేఅవుట్లు (డ్రాఫ్ట్ లేఅవుట్,ఫైనల్ లేఅవుట్) ఉంటాయని డ్రాఫ్ట్ లేఅవుట్ కు ఫైనల్ లే అవుట్ కు రెండేళ్ల వ్యవధి ఉంటుందని డ్రాఫ్ట్ లేఅవుట్ లో పొందుపరిచిన (అప్రూవ్ చేసిన) సౌకర్యాలు ఫైనల్ లే అవుట్ లో కల్పించ కుంటే డెవలపర్ (దరఖాస్తు దారు) పై చర్యలు తీసుకో వాలని కలెక్టర్ ఆదేశించారు. పది ఎకరాల లే అవుట్ కు కలెక్టరే అనుమతులు మంజూరు చేస్తారని అంతకు మించి పెరిగితే టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ హైదరాబాద్ వారు అనుమతులు జారీ చేస్తారని అధికారులు వివరించారు.అంతకుముందు లేఅవుట్ నిబంధనలు, దరఖాస్తు ప్రక్రియ తదితర అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవిన్యూ) లక్ష్మి కిరణ్, ఆర్డీవో కె.మహేశ్వర్, డీటీసీవో ఆంజనేయులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో భారీ జీతాల కుంభకోణం

**మరణించిన కానిస్టేబుళ్ల పేరుతో జీతాలు..1.40 కోట్లు స్వాహా**

కరీంనగర్ (తెలంగాణ వాణి)

చనిపోయిన ముగ్గురు కానిస్టేబుళ్ల ఐడీ నంబర్లను ఉపయోగించి ఓ ఉద్యోగి అక్రమంగా జీతాలు డ్రా చేసుకున్న ఘటన కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గురువారం వెలుగుచూసింది. పోలీసు శాఖలోని పే-సెక్షన్ (జీతాల విభాగం) లొసుగులను ఆసరాగా చేసుకున్న ఓ హెడ్ కానిస్టేబుల్, ఏకంగా ప్రభుత్వ ఖజానాను లూటీ చేశాడు. చనిపోయిన కానిస్టేబుళ్ల పేర్లతో డమ్మీ ఖాతాలు సృష్టించి, ఏకంగా రూ.1.40కోట్ల ప్రభుత్వ సొమ్మును తన జేబులో వేసుకున్నాడు. ఏండ్ల తరబడి సాగిన ఈ అక్రమ దందా ఆలస్యంగా వెలుగులోకి రావడంతో పోలీసు శాఖలో పెను ప్రకంపనలు రేగుతున్నాయి. కరీంనగర్ సిటీ పోలీస్ కమిషనరేట్ డీపీవో కార్యాలయంలోని పే సెక్షన్లో గతంలో హెడ్ కానిస్టేబుల్ పనిచేసిన నీలం రామ్మోహన్ (ప్రస్తుతం చిగురుమామిడి పోలీస్ స్టేషన్ లో పని చేస్తున్నాడు) పే సెక్షన్లో ఉన్నప్పుడు వ్యవస్థలోని డొల్లతనాన్ని పసిగట్టిన రామ్మోహన్ పక్కా స్కెచ్ వేశాడు. గతంలో మరణించిన ముగ్గురు పోలీస్ కానిస్టేబుళ్ల (సి.హెచ్.రవీందర్, కె.గంగస్వామి, కె.రవి) ఎంప్లాయ్ ఐడీలను సేకరించాడు. ఆ ఐడీలకు చనిపోయిన వారి పేర్లకు బదులుగా తనకు తెలిసిన ముగ్గురు ప్రయివేటు వ్యక్తుల పేర్లను జత చేశాడు. ఒకరు వాచ్మెన్, మరొకరు ప్రయివేటు డ్రైవర్, ఇంకొకరు మటన్ షాప్ నిర్వాహకుడు. వీరి పేర్లతో కరీంనగర్లోని భగత్నగర్, బొమ్మకల్ హెచ్డిఎఫ్సీ బ్యాంక్ బ్రాంచీలలో నకిలీ ఖాతాలు తెరిచాడు. ఈ ఖాతాలకు ఎవరికీ అనుమానం రాకుండా తన సొంత ఈమెయిల్ ఐడీలు, మొబైల్ నెంబర్లను లింక్ చేశాడు. ఈ పన్నాగంతో జూన్ 2022 నుంచి మార్చి 2026 వరకు ప్రతి నెలా ఆ నకిలీ ఖాతాల్లోకి ఠంచనుగా ప్రభుత్వ జీతాలు జమయ్యేలా చేశాడు. ఈ విధంగా ఏకంగా రూ.కోటి 40లక్షలా 18 వేలా 308 ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేశాడు. నకిలీ ఖాతాల్లో జమ అయిన డబ్బును ఏటీఎంల ద్వారా డ్రా చేయడమే కాకుండా, ఐఎంపీఎస్ ద్వారా తన వ్యక్తిగత ఖాతాలకు మళ్లించుకునేవాడు. ఇంతటితో ఆగకుండా.. ఈ నకిలీ జీతాల ఖాతాలపై ఏకంగా బ్యాంక్ లోన్లు కూడా పొందాడు. ఆ లోన్లకు సంబంధించిన ఈఎంఐలు కూడా ప్రభుత్వం జమ చేసే సొమ్ము నుండే కట్ అయ్యేలా సెట్టింగ్ చేయడం చూస్తుంటే అతడి క్రిమినల్ మైండ్ అర్ధం అవుతుంది. ఈ కుట్ర లో రామ్మోహన్కు డిపార్ట్మెంట్కే చెందిన రిటైర్డ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏఓ) వై.వి.ముని రామయ్య పూర్తి స్థాయిలో సహకరించాడు. నకిలీ అకౌంట్ల సృష్టిలో వాచ్మన్ లావుడియా రవి, ప్రయివేటు డైలీ డ్రైవర్ చుక్కా గంగరాజు, మటన్ షాప్ కీపర్ శంకర్ నామతాబాబ్ భాగస్వాములుగా వ్యవహరించినట్టు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. జీతాల చెల్లింపుల్లో కొన్ని అనుమానాస్పద లావాదేవీలు కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం దృష్టికి వచ్చాయి. ఆయన వెంటనే అప్రమత్తమై.. దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని ఏసీపీ (టాస్క్ఫోర్స్) వాసాల సతీష్ ను ఆదేశించారు. రంగంలోకి దిగిన టాస్క్ఫోర్స్ అధికారులు రికార్డులను తవ్వగా.. నకిలీ అకౌంట్లు, మరణించిన వారి ఐడీల వినియోగం తదితర ఆధారాలు పక్కాగా లభించాయి.ఏసీపీ సతీష్ ఫిర్యాదు మేరకు కరీంనగర్ వన్-టౌన్ స్టేషన్లో కేసు నమోదైంది. ఈ భారీ



స్కామ్కు సంబంధించి మొత్తం ఐదుగురు నిందితులను (రామ్మోహన్, ముని రామయ్య, లావుడియా రవి, చుక్కా గంగ రాజు, శంకర్ నామ తాబాబ్) న్యాయస్థానం ఎదుట హాజరు పరిచి రిమాండ్కు తరలించారు. ఈ కుంభ కోణంలో ఇంకా ఏయే ఉన్నతాధి కారుల హస్తం ఉంది? ఆడిటింగ్ విభాగాలు నాలుగేండ్లపాటు దీన్ని ఎందుకు పసిగట్టలేకపోయాయి? అన్న కోణంలో లోతైన దర్యాప్తు కొనసాగుతోందని పోలీసు అధికారులు చెబుతున్నారు. పోలీసు అధికారులు ఎవరైనా అవినీతికి పాల్పడితే సహించేది లేదని, అక్రమాలకు పాల్పడి పట్టుబడితే వారిపై కఠినమైన క్రమశిక్షణ మరియు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం హెచ్చరించారు. ప్రభుత్వ ఖజానాకు నష్టం చేకూర్చినా లేదా విధి నిర్వహణలో అవకతవకలకు పాల్పడినా శాఖాపరంగా ఉపేక్షించే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ పారదర్శకంగా, జవాబుదారీ తనంతో విధులు నిర్వహించాలని ఆయన ఆదేశించారు

## క్రీడలు నిత్య జీవితంలో భాగం కావాలి పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**భానూరులో ఘనంగా ప్రారంభమైన టంగుటూరి అంజయ్య స్మారక క్రికెట్ టోర్నమెంట్**



పటాన్ చెరు, ఏప్రిల్ 10, (తెలంగాణ వాణి రిపోర్టర్):

ప్రస్తుత పోటీ ప్రపంచంలో మనిషి నిత్య జీవితంలో క్రీడలు భాగం కావాలని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్ చెరు మండలం భానూరు గ్రామంలో మాజీ ముఖ్యమంత్రి టంగుటూరి అంజయ్య స్మారకార్థం ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరై, ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన జీవితాన్ని పేద, కార్మిక, కర్షక వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన మహోన్నత నేత టంగుటూరి అంజయ్య అని కొనియాడారు. అంతటి గొప్ప వ్యక్తిని స్మరిస్తూ కిడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. యువత మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి. వెంకట్ రెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, క్రీడా పోటీల నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# కార్పొరేటర్ బట్టు విజయలక్ష్మి దంపతులను పరామర్శించిన వనమా రాఘువ







పాల్వంచ (తెలంగాణ వాణి)

కొత్తగూడెం కార్పొరేషన్ పాల్వంచ 34వ డివిజన్ కార్పొరేటర్ బట్టు విజయలక్ష్మి లక్ష్మణ్ దంపతులను వనమా రాఘువేందర్ పలువురు బిఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో కార్పొరేటర్ బట్టు విజయలక్ష్మి లక్ష్మణ్ దంపతుల కుమారుడు అఖిల్ నందన్ (విక్కీ) మరణించారు. కరకవాగులోని వారి నివాసానికి వెళ్లిన రాఘువ విజయలక్ష్మి లక్ష్మణ్ దంపతులను పరామర్శించి కుటుంబ సభ్యులకు, ధైర్యం చెప్పి ప్రమాద ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ పాల్వంచ పట్టణ అధ్యక్షులు మంతపురి రాజు, మండలాధ్యక్షుడు, పూసల విశ్వనాథం, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మల్లెల రవిచంద్ర, ముత్యాల ప్రవీణ్, పాల్వంచ పట్టణ మహిళా అధ్యక్షురాలు బట్టు మంజుల, 38వ డివిజన్ కార్పొరేటర్ బత్తుల మధుచంద్, 7వ డివిజన్ కార్పొరేటర్ సింధు తపస్వి, 39వ డివిజన్ కార్పొరేటర్ గోవాడ గుణచరితు, 32వ డివిజన్ కార్పొరేటర్ గుగులోత్ రాంబాబు, బిఆర్ఎస్వి అధ్యక్షులు జూపెల్లి దుర్గాప్రసాద్, కాల్వ ప్రకాష్, దాసరి నాగేశ్వరరావు, మార్గం గురవయ్య, ఆనంద్, సురేష్, బట్ట సురేష్, నారికట్ల శేఖర్, ఆదినారాయణ, పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు,